
# ఒడ్డుచేరని కెరటం



యర్రంశెట్టి సాయి

ఆకాశం మొఖం నల్లగా సూడ్చుకొంది. కాసేపుంటే ఫొల్లున ఏడ్చేట్లుంది. హాస్పిటల్ వార్డంతా నిశ్శబ్దంగా వుంది. తాతయ్య ఇరవైనాలుగో నెంబరు బెడ్‌మీద పడుకొని డిటెక్టివ్ నవల చదువుతున్నాడు. అలాంటి పుస్తకాలంటే తాతయ్య కిష్టం లేదు. కాని తన కిష్టం అన్న సంగతి తాతయ్యకి తెలుసు. అంచేత చూపు సరిగ్గా ఆనక పోయినా తను తెచ్చిచ్చిన డిక్టీవ్ నవల కష్టపడి చదువుతున్నాడు. అందుకే తాతయ్యంటే తన కిష్టం. దూరంగా గేటు దగ్గర ఇద్దరు నర్సులు ఎలక్ట్రిక్ దీపం కాంతిలో ఏదో కాగితం చదువుతున్నారు, ఏమై వుంటుందా కాయితం? ఏమో? ఏదయినా అయుండొచ్చు.

‘ఇవిగో స్లీపింగ్ పిల్స్...’

సిస్టర్ ఇరవైమూడు బెడ్‌మీదతనకి ఇస్తోంది. పాపం ఆయనకి నిద్రపట్టదు గాబోలు. అదో జబ్బు. ఈ జబ్బు చాలా మందికుంది. తనకీ వుంది. క్రొత్తగా రిలీజయిన పిక్చరుకి ఏ కారణం చేతయినా వెళ్లకపోతే (నూరు పాళ్లు వెళ్తాడు) ఆ రాత్రంతా నిద్రపట్టదు. క్రిందటి సోమవారం కెమిస్ట్రీలాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తూండగా టెస్ట్ ట్యూబ్ పగిలితే తన ఎదురుగ్గా వున్న బి. జెడ్‌సీ పిల్ల సువర్చల ఘొమ్మని నవ్వేసింది. అందుకు వళ్లు మండిపోయి ఆ రోజు సాయంత్రం సువర్చల కాలేజి నుంచి ఇంటికి వెడు'తోంటే, కాలేజిగేటు దగ్గర మొదలెట్టి, ఆమె ఇంటివరకూ తను సువర్చలని ప్రేమించేడు. ఆరోజు రాత్రి కూడా తనకి నిద్రపట్టలేదు. అంతకు ముందు నాలుగయిదుసార్లు సీనియర్ క్లాసమ్మాయిలని ప్రేమించినప్పుడు కూడా తనకలాగే నిద్ర పట్టలేదు. ఇది ఒక్క తనకనే కాదు. సీతాపతిగాడిక్కూడా- ఎప్పుడేనా ప్రేమించినప్పుడు అలాగే నిద్రపట్టదట. ఇంకోటి గూడా చెప్పాడు వాడు. ప్రేమించినమ్మాయి దగ్గరయినా కూడా నిద్ర పట్టదట.

‘ఒరేయ్! ఆ వరండాలో ఎందుకూ? చలిగాలి వేస్తోంది! లోపలికి రా!...’ తాతయ్య పిలుస్తున్నాడు. టైము ఎనిమిదయింది, సెకండ్‌షో తొమ్మిదీ నలభై యైదుకి. చాలా టైముంది. కాసేపు తాతయ్యతో ‘హస్కు’ కొడితే ఇట్టే గడిచి పోతుంది. ఈ లోపల వర్షం తగలడకుండా ఉంటే చాలు.

‘వరేయ్! ఈ డిటెక్టివ్ అడ్డమయిన ఎంగిలి సిగరెట్లూ జేబులో వేసుకొంటాడు. వీడికేం రోగం రా?...’

పిచ్చి తాతయ్య! ఆ సిగిరెట్టు ముక్కలే హంతకుల్ని పట్టిస్తాయని తెలీదు పాపం! ఆ సంగతే చెప్తే నవ్వాడు తాతయ్య. నవ్వి అడిగాడు.

‘నాకు తెలీకడుగుతాను. తాపీగా సిగరెట్లు త్రాగుతూ చంపుతారన్నమాట హంతకులు’ వళ్లు మండుతోంది తాతయ్య ప్రశ్నకి.

‘చదవడం ఇష్టంలేదని చెప్పరాదూ! ఇలాంటి చచ్చు ప్రశ్నలేసి తనని విసిగించక పోతే.

చలిగాలి రివ్వున వీచింది. చినుకులు మొదలవుతాయేమో!

‘డియర్ గాడ్! తొమ్మిదిన్నరవరకూ వాన దేవుడి పీక నొక్కెయ్! నేను సినిమాకెళ్లాక

కురిసినా ఫర్వేదు.

తాతయ్య తిరిగి డిటెక్టివ్ కథలో మునిగిపోయాడు. మూల ఇద్దరు పేషెంట్లు కబుర్లు చెప్పుకొంటున్నారు. అందులో ఒకతను క్రొత్తగా ఎడ్మిట్ అయాడు. రెండోవాడు చాలా పాతవాడు. తాతయ్యకంటె పాత పేషెంట్! తాతయ్యచేరి మూడు నెలలవుతోంది. అప్పట్నుంచీ తను రాత్రిళ్లు తాతయ్యదగ్గరే పడుకొంటున్నాడు. అంచేత ఈవార్డులో వాళ్లందరూ బాగా తెలుసు. నర్సులందరూ బాగా పరిచయం. అందరిలోకి దేవకినర్సు చాలా బావుంటుంది. సెక్సీగాకూడా వుంటుంది. ఆమధ్య చూసిన ఇంగ్లీష్ సినిమాలో హీరోయిన్‌లా వుంటుంది. ఆ అమ్మాయిని ప్రేమించేద్దామనుకొన్నాడుగానీ తాతయ్యదగ్గరుండి పోయాడు. ఈ వెధవ్వేషాలన్నీ ఇట్టే పసిగట్టేస్తాడు. చాలా కేర్ఫుల్‌గా వుండాలీ ముసలాయనతో! ఎక్కడా దొరగ్గూడదు.

అదో! దేవకి నర్సు వచ్చేస్తోంది. తాతయ్యకి టాబ్లెట్స్ ఇవ్వడానిగ్గాబోలు. తన క్రాఫ్ చెదిరిపోయినట్లుంది వెధవ క్రాఫ్! సరిగ్గా దేవకి వచ్చేప్పుడే చెదరిపోవాలా?

ఏమండోయ్! ఇంకా నిద్రపోలేదేం? ఏదేనా సినిమాకి ప్రోగ్రాం వేశారేమిటి?' నవ్వుతూ అడిగింది. అబ్బ! నవ్వుతూంటే ఎంత అందంగా వుంటుందని.

'మీదిష్టే తగిలింది! చూడండి వర్షం కురిసేట్లుంది...'

'బావుందండోయ్! మీరు సినిమాకెళ్తే మధ్యన మాకెందుకు...' చిరుకోపంతో అంది. ఈ ఫోజులోకూడా అద్భుతంగా వుంది దేముడో! అందాన్ని అందరికీ సమంగా పంచక ఎందుకుసార్! ఇలా ఒక్కొక్కచోటే పడేస్తూంటారు?

'యమధర్మరాజా కూతురొచ్చిందా?' డిటెక్టివ్ నవల ప్రక్కనపెట్టి అడిగాడు తాతయ్య.

హాస్పిటల్లో అందరికీ పేర్లెట్టాడు తాతయ్య.

హాస్పిటల్ నరకం. ఆపరేషన్లు చేసే పెద్దడాక్టరు యమధర్మరాజా. చిన్న డాక్టర్లు యమధర్మరాజా కజిన్స్. నర్సులు యమధర్మరాజా కూతుళ్లు. వార్డ్‌బాయ్‌లందరూ యమకింకరులు. పేషెంట్లందరూ పాపాలు చేసి శిక్ష అనుభవించటానికి వచ్చినవాళ్లు. పాపంకొద్దీ శిక్ష; వాళ్లగాయాల్ని హౌస్ సర్జన్లు ఇష్టం వచ్చినట్లు కెలికెయ్యడం చిత్రవధ.

'అవునండీ! రెండోకూతుర్ని!' అంది దేవకి నవ్వుతూ.

'ఇంకా ఆలస్యం ఎందుక్కూ? ఆ విషం మాత్రలిటివ్వు!... ఇవాళ నా వంట్లో సూదులు గుచ్చే శిక్ష అన్నారుగా! గుచ్చలేదేం?'

'మందు అయిపోయింది రేపు గుచ్చుతాం వదలం లెండి!'

మాత్రలు తీసుకొని మ్రింగి మంచినీళ్లు త్రాగాడు తాతయ్య.

'నిన్న మీరిచ్చిన నవల చదివానండీ! చాలా అద్భుతంగా వుంది...ఇంకోటేదయినా ఇవ్వండి...'

'ఇది బావుంది. చాలా బావుంది. చదివిన నవల తిరిగి ఇవ్వరేం?' ఈ అమ్మాయితో మాటలు ఎంత పెంచుకొంటే అంత బావుంటుంది.

'అబ్బ కొరుక్కు తినేయంలెండి మీ నవలని...తెచ్చి ఆ గదిలో వుంచాను...'

'ఏమో! మీ హాస్పిటల్ వాళ్లని నమ్మిందెవరు. 'తినేయడం' బాగా అలవాటు...'

'ఊహూ! ఈ మాటలే నేర్పుతారు కాబోలు కాలేజిలో!'

'పోనీ సరదాగావుంటే మీరూ రండి! నేర్చుకొందురుగాని...'

'ఏం అఖ్కర్లేదు...'

'పోనీ నేను నేర్పేదా?'

'అబ్బ! అలాగేం?' అంటూ నవ్వుకొని వెళ్లిపోయింది. అక్కడ్నుంచి.

'ఒరేయ్! మొన్నేగా సినిమాకెళ్లావ్! మళ్లీ ఇప్పుడు వెళ్లకపోతెనేం?'

'అవును తాతయ్యా! మొన్ననగా వెళ్లాను. ఇప్పుడు వెళ్తేఏం?'

'మరి కాలేజి పుస్తకాలెందుకురా ఇక్కడికి తేవటం! చదివేవాడిలా!'

'డాడీ వూరుకోరు తాతయ్యా! చదువుతున్నట్లు యాక్టేయాలి మనం. అంతే!'

'మీ నాన్నకి పిల్లల్ని సరిగ్గా పెంచడం తెలీదురా! చూడు నువ్విలా చెడిపోతున్నావో!'

'తెలిసి నువ్వు నాన్నని, బాబాయిలని బాగా పెంచావ్ తాతయ్యా! నిన్ను హాస్పిటల్లో చేర్పించి మళ్లీ అంతులేకుండా తిరుగుతున్నాడు నాన్న! అసలు నువ్వున్నావనే సంగతే మర్చిపోయారు బాబాయిలు. అమ్మమ్మ ఒక్కసారి వచ్చి ఓ పదినిమషాలుండి 'పొలం పనులున్నాయంటూ' వెంటనే వెళ్లిపోయింది. ఎందుకు తాతయ్యా! వీళ్లందరినీ ఎందుకిలా తయారు చేశావ్?' ఇవన్నీ తను తాతయ్యని అడగ్గలడు. కానీ అడగడు. దీనికి జవాబు తాతయ్యకీ తెలుసు. తనకీ తెలుసు.

ఈ హాస్పిటల్లో కథలు కూడా బోలెడు విన్నాడు తను.

పేషెంట్‌కి ఆపరేషన్ చేయాల్సివస్తే ఎంతో కొంత ముట్టజెప్పాలి. లేపోతే నెల్రోజుల్లో జరగాల్సిన ఆపరేషన్ ఆర్నెల్లకి చేస్తారు. తరువాత ఆర్నెల్లకి డిశ్చార్జి చేస్తారు. నరకంలో పధ్నాలుగు నెలలంటే మాటలు కాదు. సజీవంగా ఎవ్వరూ బయటకి వెళ్లరు. డామ్ హెల్! లెటిట్ బి! తొమ్మిదయిపోయింది. ఇక ఇక సినిమాకెళ్లిపోడం బెస్టు.

'తాతయ్యా! తొమ్మిదయిపోయింది ఇక పడుకో! నేను పోతున్నాను...'

'ఆ లైటు తీసేసిపో!'

మెట్లు దిగుతోంటే దేవకి ఎదురొచ్చింది.

'ఏ సినిమాకేవిటి?'

సంభాషణలో ఈసారి కొంచెం చొరవ చెయ్యాలి. లేకపోతే ఎన్నాళ్లని... ఈ ఉట్టుట్టి డైలాగులు.

'ఏం మీరూ వస్తున్నారా?'

'ఛీ! నేను రావడమేమిటి?'

'ఏం పెద్ద ఖూనీ చేసినట్లు మాట్లాడుతున్నారు? ఎప్పుడూ సినిమాకెళ్లలేదా?'

ఎప్పుడూ మొగాళ్లతో వెళ్లం తెలుసా?'

'అలా అని నేనన్లేదుగా ఇప్పుడు?'

'అమ్మో! ఎంత గడుసు వారో! అనలేదుట!' కళ్లు త్రిప్పుతూ వెక్కిరించింది.

'ఏమని?'

'ఊహూ! మీతో ఇలా మాట్లాడుతూ కూర్చుంటే ఈ మెట్లమీదే తెల్లారిపోతుంది. నేను వెళ్తాను బాబూ!...'

చకచక మెట్లెక్కేసింది. గేటుదగ్గర ఘూర్కావాడు సెల్యూట్ కొట్టాడు.

'కితే బజే వాపసాతే సాబ్!'

'ఒంటిగంటన్నరవుతుందోయ్!'

వీడికి అప్పుడప్పుడు పావలో అర్ధో ఇస్తూండాలి. లేపోతే బయటకీ లోపలికీ ఇష్టమొచ్చినట్లు తిరగనీడు.

సినిమాహాలు దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఈ సినిమాకిది మొదటిరోజు! చదలు పట్టినట్లున్నారు జనం. ముందే రిజర్వేషన్ చేసుకోడం మంచిదయింది. ఈ జనంలోదూరి హాల్లోకెళ్లడానికే పావుగంట పట్టేట్లుంది.

'హీరోయిను నాలుగుపార్లు స్నానం చేసే సీన్లుండయ్యంట్రా!' ఎవరో ప్రక్కవాడితో అంటున్నాడు.

టికెట్లు గేటుదగ్గర ఇవ్వగానే ఒహ టార్చిలైటు వాడొచ్చి సీటుదగ్గరకు లాక్కుపోయి అందులో కూలేశాడు. ఇటు ప్రక్క ఒహ మీసాలవాడు. అటు ప్రక్క తన జూనియర్ స్టూడెంట్స్. ఎదురుగా సీట్లలో క్రొత్తగా పెళ్లయిన జంట గాబోలు. ఆపిల్ల తెగ బోలెడు సిగ్గుపడిపోతోంది. మొగుడేశ్వర్రావు ఆ పిల్లని ఊరికే 'వరాలు' కోరుకోమని వేధించుకు తింటున్నాడు

'సుశీ! గోల్డ్‌స్పాటు త్రాగుతావా? వద్దా! పోనీ చాక్లెట్ టీ? అదీ వద్దా మరి చిప్స్ తీసుకోరాదూ!... అబ్బ! ఏదో


# ఒడ్డుచేరని కెరటం

హాటి అడుగు సుశీ!...

సుశి అడగలేదు. ఇంకొంచెం సిగ్గుపడింది. పడి ముసిముసిగా నవ్వింది. నవ్వి మళ్లీ సిగ్గుపడింది. అప్పుడు 'హేం వద్దండీ!' అంది మెల్లగా వాడికొక్కడికే వినబడేట్లు. స్లైడ్సు వేస్తున్నారు. నర్సమ్మ చుట్టలే కాల్చుడు. మీ క్రాఫ్‌కి సింగనాథం కటింగ్ సెలూన్‌నే వాడుడు. మీ పిల్లలకి ఫామిలీ ప్లానింగ్‌నే వాడుడు. అయిపోయినయి. ఇండియన్ న్యూస్‌రీలు బిగినయింది. మనదేశం వాడెవడో అదేదో దేశం వెళ్లాట్ట! ఇంకోదేశంవాడు మందేశానికి వచ్చాట్ట! బొంబాయిలో ఓ పెన్‌కార్లో కాసేపు తిరిగాడు. జనంలో ఒహడు కారు మీద పూలు విసిరాడు. తరువాత కెమెరా వేపు తిరిగి నవ్వాడు. తరువాత వరదల్లో కొట్టుకుపోయిన కొంచెం ఇండియా చూపించాడు. నిరాశ్రయులయిన వారందరినీ వరుసగా నుంచోబెట్టి గ్రూప్‌ఫోటో తీశాడు. అందులో ఓ పదేళ్లపిల్ల ఎందుకో నవ్వుతోంది. ఎందుకో? దృశ్యం మారిపోయింది.

ఇందిరాగాంధి చుట్టూ అడవిజాతి వాళ్లెవరో మూగి డాన్సు చేస్తున్నారు. వాళ్లనృత్యం కొంచెం రాకెన్‌రోల్ మోడల్‌లో వుంది. వాళ్లు మందేశంలోనే అదేదో పేరు చెప్పాడు, ఆ ప్రాంతంలో ఉన్నార్ట. అక్కడి ఆడాళ్లు అర్ధనగ్నంగా వున్నారు. సామిరంగా! బ్రహ్మాండంగా వుంది సీను. ఈ దృశ్యం సెన్సార్ వాళ్లకళ్ల పడలేదుగా వాల్లు. రేపు తన బాచివాళ్లందరినీ కొట్టుకొచ్చి చూపించాలి. ఇంకోదృశ్యం. బోలెడుమంది సర్దార్జీలు, కొంచెంమంది మామూలువాళ్లు కలిసి చచ్చేంతస్పీడుగా ఫుట్‌బాల్ ఆడారు. చివరకి రెండిట్లో ఓ టీమ్ గెల్చింది. సీన్‌ఛేంజ్! బోలెడుమంది పిల్లలు రోడ్డు కడ్డంగా పరిగెడుతున్నారు. వాళ్లమీద 'రెడ్‌ట్రయాంగిల్' పడింది. ది ఎండ్!

సుశీల మొగుడేశ్వర్రావు చెవిలో ఏదో గుసగుసలాడింది. ఇద్దరూ చిటుక్కున నవ్వుకొన్నారు. ఏం చెప్పిందో? ఏదో జోక్ వేసి వుంటుంది కుటుంబ నియంత్రణం గురించి. గుండెలు పగిలేంతశబ్దం విన్పించింది. అసల్సినిమా మొదలయిపోయింది. పందొమ్మిది రీళ్లు. అంటే తెల్లారి ఏడవుతుందన్నమాట. చెట్లమీద టైటిల్స్ వేస్తున్నారు. వెనుక నేపథ్యగానం 'ఇంతేరా మన బ్రతుకులూ, అతుకుల, గతుకుల బాటలూ...' రోడ్డుమీద రెండుపేర్లు, ఏదో బస్ పోతూంటే దానివెనుక రెండుపేర్లు పడినయి తాడిచెట్టుమీద ఓ పేరూ, మిగతా పేర్లన్నీ పొలాలమీదా పంట కాలవమీదా పంచారు. సినిమా బిగిన్ అయింది. చిన్నహాః! అందులో ఓ ముసలాడు కుక్కిమంచంలో పడుకొని ఊరికే దగ్గుతున్నాడు. తాతయ్య గుర్తొస్తున్నాడు ఆ ముసలాడిని చూస్తుంటే! పాపం తాతయ్య! మూణ్ణెల్లయింది హాస్పిటల్లో చేరి. ఎలా వున్నావని అడిగినవాళ్లులేరు అమ్మమ్మని చూస్తే వళ్లుమండిపోతోంది తనకు. తాతయ్యకూ అమ్మమ్మకూ ఎప్పుడూ పడేది కాదుట. అయితే అంతమాత్రాన మంచాన పడివున్న తాతయ్యని ఏమాత్రం 'కేర్' తీసుకోకుండా 'పొలంపనులున్నా'యని వదిలేసి వెళ్లిపోయిన అమ్మమ్మని తనెప్పుడూ క్షమించలేడు. అది అమ్మమ్మ కాదు. ఓ డెవిల్! అందాకా ఎందుకు తన ఫాదర్‌మాత్రం. పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. బోలెడు జీతం. లంచాలు తీసుకొంటూంటాడు. వారం వారం పెద్ద పెద్దాళ్లకి పేద్దడిన్నర్లు ఇస్తూంటాడు.



అమ్మ క్లబ్బులకీ, అక్కడికీ తిరిగి బోలెడుడబ్బు ఖర్చుచేస్తుంది. కానీ ఇద్దరూ తాతయ్యని ఛస్తే దగ్గరకి రానివ్వరు.

'తమ్ముడు దగ్గరకెళ్ళక పోయావా నాన్నా!' అని వెళ్ళిపోతాడు ఆఫీసుకి. బాబాయిలు సరే సరి! ఒకడు హెన్ పెక్డ్ బగ్గర్! వాణ్ణి చూస్తేనే తనకి వళ్ళు మండిపోతుంది. పిన్నికి చాక్‌పీసిచ్చి ఓ గీత గియ్యమన్జెప్పి ఆ గీత మీద నడుస్తాడు. రెండో బాబాయి, అసలెక్కడున్నాడో కూడా తెలీదు ఎవ్వరికీ! తండ్రికి డబ్బు పంపాల్సొస్తుందని ఉత్తరాలు వ్రాయడం గూడా మానేశాడు. అత నింటి నిండా భార్య తాలూకు పుట్టింటి జనం పుట్టలు పుట్టలుగా పడి మేస్తుంటారు. వీళ్ళెవ్వరికీ తాతయ్య అక్కర్లేదు. వీళ్ళకి మనుష్యత్వం లేదు. అమ్మమ్మ ఓ గయ్యాళి గంప. కొడుకులందరితోనూ తెగతెంపులు చేసుకొని ఊరుకొంది. తాతయ్య ఒక్కడే ఓ మూల పాపం! తన కందుకే తాతయ్యని చూస్తే జాలి, తాతయ్య వీళ్ళందరినీ తలుచుకొని లోలోపల కుమిలి పోతున్నాడు. తనకి తెలుసు. కాలేజి ఫీజు కని ఎక్కువ డబ్బు నాన్న దగ్గర కొట్టేసి తాతయ్యకి ఓరోజూ పళ్ళూ, టానిక్కులూ తీసుకొచ్చేడు తను. అప్పుడు తాతయ్య తనని చూసి ఎంత ఏడ్చాడని.

'ఒరేయ్! నువ్వు పులివిరా! కాని తోడేలు కడుపున ఎలా పుట్టేవు!...' తాతయ్య ఏడుస్తుంటే తనకీ కన్నీళ్ళాగ లేదు. పాట మొదలయింది సినిమాలో. వెధవది సినిమా మీద మనసు నిలవడం లేదు.

'ఫర్లేదు! ఏం ఫర్లేదు తాతయ్యా! చేసున్నాను. ఇంకొక్క సంవత్సరం ఓర్చుకో! డిగ్రీ చేతికి రాగానే ఓ మంచి ఉద్యోగం సంపాదించి నిన్ను తీసుకెళ్ళిపోతాను. నువ్వు నా దగ్గరే వుందువుగాని. మా యిల్లంటే అసహ్యం నాకు. ఛస్తే అక్కడికి పోనిహ! వీళ్ళెవ్వరి మొఖం మనం చూడొద్దు...ప్లీజ్! నన్ను నమ్మ తాతయ్యా!'

బోలెడు సినిమా అయిపోయినట్లుంది.

'ఫొటోల సీను వచ్చింద్రోయ్!' ఓ కుర్రాడు అరచాడు.

మొదటి తరం హీరోయిను, చని పోయిన భర్త ఫొటో దగ్గర కెళ్ళి ఫామిలీ కొచ్చిన సమస్యల గురించి బరువుగా మాట్లాడుతోంది ఫొటోతో! మొ॥ త్ర॥ హీరోయిను తండ్రి. చనిపోయిన పెళ్ళాం ఫొటో దగ్గరకెళ్ళి 'శాంతా! అమ్మాయి నాతో మాట్లాడ్డం లేదు శాంతా! ఎలా! చెప్పవూ! చెప్పకపోతే నీ ఫొటోకే నా తల కొట్టుకొని ఛస్తా!' అంటూ భోరుమని ఏడ్చాడు. ఈ లోపల రెండోతరం హీరో ఆ గదిలోకి వచ్చాడు.

'వాడు మొఖానో ఫొటో పడెయ్యండ్రా! వాడూ ఏడుస్తాడు!' అరచారు కుర్రాళ్ళు. కొంచెం మంది గట్టిగా నవ్వారు. వెంటనే ఫొటోలు మనుషులయి మాట్లాడి మళ్ళీ ఎప్పుడు మాట్లాడాలో చెప్పేసి వెంటనే ఫొటోలయిపోయినయి. సీను మారి పోయింది. రెం॥ త॥ హీరో, హీరోయినూ నీళ్ళలో నడుం లోతుకి దిగి వణుకుడు పాట పాడుతూ ప్రేమించుకొంటున్నారు.

ముందు సీట్లో భుజంచుట్టూ చెయ్యి వేశాడు మొగుడు.

ఇంటర్వల్! లైట్లు వెలిగినయి! సుశీ మొగుడూ దూరంగా జరిగి కూచున్నారు.

మళ్ళీ బతిమాలాడు మొగుడు 'సుశీ! ఏమయినా అడగవూ? ప్లీజ్!'

'ఊహూ!' అంది సుశీ గారంగా

'ప్లీజ్! సుశీ ఇంకెప్పుడూ ఇలా అడగమని అడగనుగా! ఈ ఒక్కసారికి అడగవూ!' అని ఏడ్చాడు వాడు.

వాడి ఏడుపు చూళ్ళేగ్గాబోలు 'సరే గోల్డ్‌స్పాట్ తేపో!' అంది సుశీ. వాడు సంతోషంతో అందరికాళ్ళు తొక్కు కొంటూ, తిట్లు వినిపించుకోకుండా బయటకి పరిగెత్తి ఓ కుర్రాణ్ణి వెంటబెట్టు కొచ్చేడు. ఇద్దరికీ చెరో డ్రింకూ ఇచ్చేడు కుర్రాడు. మళ్ళీ సినిమా మొదలయింది.

హీరో హీరోయినూ ఇద్దరూ ఒకరి నొకరు అపార్థం చేసుకు తగలడ్డారు. హీరో యిను తనగదిలో వరస బావదగ్గర నుంచొని రెండర్థాల డైలాగులు మాట్లాడుతోంటె హీరో మామూలుగానే గోడచాటునుంచుని విని, మొదటర్థం గాలి కొదిలేసి, రెండో అర్థం తీసేసుకొని కొండలమీదికి పరిగెత్తాడు. అక్కడ 'అసలన్నెందుకు పుట్టించావ్?' అని భగవంతుడికోసం వెదుకుతూ పాట మొదలెట్టాడు. హాల్లో జనం అందరూ చాలా ఇదయ్యారు! 'పూర్ ఫెలో! మొదట్నుంచీ చూస్తున్నాను సార్! పాపం అన్నికష్టాలే వాడికి!' అని కొంచెంమంది ఫీలయ్యారు. అందరికీ డైలాగులు రాసిన వాడిమీద కోపంవచ్చింది. 'ఇలాంటి అపార్థం డైలాగు లెందుకు వ్రాయాలి వాడు? దీనంతటికీ కారణం వాడేకదా!' అని కోప్పడ్డారు. ఇంకొంచెంమంది హీరో హీరోయిన్ల ఎడబాటు చూళ్ళేక లేచి ఇంటికెళ్ళిపోయారు.

సుశీ వెక్కివెక్కి ఏడుస్తోంది. మొగుడు సముదాయిస్తున్నాడు.

'ఇది నిజంకాదు సుశీ! సినిమా! నిజం! కావాలంటేచూడు మనచుట్టూ జనం వున్నారు. అందరూ ఏడుస్తున్నారా? ఏం ఏడవటం లేదు! పైగా మనవెనక కుర్రాళ్ళుచూడు నవ్వేస్తున్నారు. అదీగాక హీరో హీరోయినూ ఇంకో అరగంటలో మళ్ళీ ఇట్టే అర్థంచేసుకొని ఒకటయి పోతారు చూస్తూండు! వాళ్ళమాటల నిలకడేముందని?...

సుశీ ఊరుకొంది. మొగుడు భుజంమీద తలవాల్చింది.

రేడియం ముళ్ళు ఒకటిన్నర మీదున్నయి. నిద్ర వస్తోంది వెధవ సినిమా! ఇక వెళ్ళిపోడం ఆరోగ్యం.

హాస్పిటల్ చేరుకొనేసరికి రెండవ్తోంది. దేవిక టేబుల్‌మీద తలపెట్టుకొని కుర్చీలో కూర్చుని నిద్రపోతోంది ఆమె మొఖంమీద వెంట్రుకలు ఫాన్‌గాలికి అటూ ఇటూ ఊగుతున్నయి. అబ్బ ఎంత అందం.

గంటలకొలది అలా చూస్తూండి పోవచ్చు. తనకాలేజి మొత్తంమీద ఇంత అందమయిన అమ్మాయి ఎవ్వరూ లేరు.

ఉలిక్కిపడి లేచింది దేవిక.

'మీరా?' అంది కళ్ళు సగం తెరచి.

'ఔనండీ! ఇప్పుడే వస్తున్నాను...'

ఏదో తప్పుచేసినట్లు తడబడినయి మాటలు.

'ఎలావుంది సినిమా?'

'మామూలుగానే!'

'అంటే?' వెనక్కి కూర్చుని, కళ్ళు మరిమి నిద్రని వెళిపేసింది'.

'పిడ్చినట్లుంది నన్నుమాట!'

'బావుంది! కొంచెం 'టీ' తాగుతారా ?'

'మీదయ !'

'ఛీ! 'టీ' ఇవ్వడంకూడా దయేనేమిటి ?... అది సరే అలా చూస్తున్నారెందుకు! ఆ రెండోకుర్చీ మీలాంటి వాళ్లకోసమే వుంది!...'

'ఆల్‌రైట్! కూర్చుంటాను !'

ఇద్దరికీ చెరోగ్లాసులోకి వంచింది 'టీ'! గ్లాసు అందుకొని తాగుతూంటే అంది.

'ఇన్ని సినిమాలు చూస్తారు గదా! ఏదోమాటి మాట్లాడడం నేర్చుకోలేరూ! అలా నిశ్శబ్దంగా చూడకండి !'

'ఎన్ని నేర్చుకొన్నా మీ ఆడాళ్లముందు మాట్లాడలేము.'

'అబ్బ! పాపం! కాలేజీలో ఆడపిల్లల్ని ఏడిపించటానికి ఎలా మాటలొస్తాయో?'

'మేం ఊరికే అల్లరి చేయటం లేదు. వాళ్లు కావాలంటేనే గొడవచేస్తాం!'

'ఊహూ! కావాలని అడుగుతారుట! ...ఓ రెణ్నెళ్లు పాపాయికి చెప్పండి ఈ మాటలు !'

ప్రక్కవార్డు నర్సు భవాని వచ్చింది.

'దేవకీ! రావే! పంచల పిలుస్తోంది!'

దేవకి లేచి నుంచుంది. 'గుడ్‌నైట్'

'గుడ్‌నైట్...చూడండి! నేను వరండాలో పడుకొంటాను. ఓవేళ తాతయ్య లేచి అడిగితే చెప్పండి!'

'ఓ. కే. యువరానర్ !'

నిద్ర ముంచుకొస్తోంది. తాతయ్య గాఢ నిద్రలో వున్నాడు. అబ్బ! చల్లనిగాలి వరండాలో! 'అబ్బ! పూర్ తాతయ్యా! ఎంతహాయిగా నిద్రపోతున్నావ్! నువ్వేదయినా మనశ్శాంతి అనుభవిస్తే, అది నిద్రలోనే కాదూ! నాకు తెలుసు తాతయ్యా! నువ్వు పైకి ఏదీ చెప్పవు. లోలోపల దాచుకొని పైకి కనబడకుండా ఏడుస్తున్నావ్! భయపడకు తాతయ్యా! నేను కొడుకుల్లాంటి వాణ్ణికాదు. కొంచెం మంచాణ్ణి. నన్ను నేను పోషించుకొనే స్తోమతు కల్గితే చాలు. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకొంటాను. డోంట్ వర్రీ ఎవ్రీ డియర్ ఓల్డ్‌మన్!...నిద్రొస్తోంది... ఈలోగా నీతో కొంచెం మాట్లాడుకోవా దేవకీ! ఓ 'యంగ్ బ్యూటీ! నిన్నే అదృష్టవంతుడు పొందుతాడో! ఏమయినా ఇంకొన్ని రోజులిక్కడ వున్నానంటే నా లక్ 'ట్రై' చేసి చూస్తాను ఈలోగా కొంచెం పరిచయం పెంచుకోనీ! ప్లీజ్! అందుకు అవకాశమియ్యవూ...'

*　　　*　　　*

దేవకి బాగా కుదిపి లేపుతోంది 'మిస్టర్! లెండి!' కళ్లు బలవంతంగా తెరచుకొన్నాయి. బాగా తెల్లారి పోయింది.

'గుడ్‌మార్నింగ్. మేడమ్!'

'గుడ్‌మార్నింగ్ టైము ఆరయింది... లేవండి!'

'ఊఁ! ఏమిటి లేచి చేసేది?'

'ఇటు రండి! కొంచెం పనుంది...'

'చెప్పండి!'

'వెరీ సారీ! మీ తాతయ్య పదినిమిషాల క్రితం చని పోయారు. చాలా ప్రయత్నించారు డాక్టరుగారు. లాభం లేక పోయింది...'

నవ్వుకుండానే తాతయ్య మంచం వేపు అడుగులు పడినయి. తాతయ్య నిశ్చలంగా పడుకొని ఉన్నాడు. షెల్ఫుమీద డిటెక్టివ్ పుస్తకం పేజీలు గాలికి రెపరెప కొట్టుకొంటున్నాయి.

'ఇంటికి ఫోన్ చేయండి...' దేవకి అంటోంది.

అంతా అయోమయంగావుంది. మనసంతా ఖాళీ అయిపోయింది. ఏమీ ఆలోచనల్లేవు. జరిగిందాన్ని నమ్మలేకపోతోంది మనసు.

'ప్లీజ్! నామాట విని విూ ఇంటికి ఫోన్ చెయ్యండి...'

'ఆల్‌రైట్! నువ్వు తెలివిగలవాడివి తాతయ్యా! డ్రామా సగంలో నీ 'కారెక్టర్' అనవసరం అన్నారందరూ. వెంటనే స్టేజి దిగిపోయావ్! నీకు నేనెంతమాత్రం ఉపయోగపడలేకపోయాను తాతయ్యా! ఏం చెయ్యను! డ్రామాలో నాకు పోర్షనివ్వలేదు. ఓవేళ మధ్యలో స్టేజి ఎక్కినా నాకు యాక్షన్ రాదు. అంతే! వెళ్లిపో తాతయ్యా! వెళ్లిపో! ఇప్పుడు మా నాన్నతోసహా నీ కొడుకులసబ్ సన్యాసులందరూ వస్తారు. అందరూ చందాలేసుకొని గ్రాండ్‌గా నిన్ను దహనం చేస్తారు...జరిగేదింతే! గుడ్‌బై తాతయ్యా. మే యువర్ సోల్ రెస్ట్ ఇన్ పీస్! ●

